"ఏమండీ కనీసం మీ పేరైనా చెప్తారా....?" ఆమె సూటిగా అతన్ని చూసింది. ఆ చూపులో కసి, కోపం, భయం వున్నాయి. 'ఏమిట్రా ఈ సౌద' అనే భావంకూడా వుంది.

"పోనీ లెండి నా పేరు మాత్రం పవన్" అన్నాడు.

ఈసారి నవ్వాపడం కష్టమైంది. విచిత్రంగా చూసింది ఆమె నావైపు. ఎవడో పొట్టికుర్రాడు విజిల్ వేసుకుంటూ వెళ్ళాడు వాళ్ళిద్దర్నీ చూస్తూ. వాడ్ని చూస్తేకూడా నవ్వొచ్చింది.

ఇంతలో బస్సు వచ్చింది. స్పృహ వచ్చినట్లు పరిగెత్తాను. నాలాగ ఎందరో. బస్సు కదిలింది. జారిపోతున్న కళ్ళజోడు సరిచేసుకున్నాను.

అప్పుడు కనిపించారు—పవన్, ఆమె—ఇద్దరూ ప్రక్క-ప్రక్కనే నా ముందునే!

"మీకూ టికట్ తీసుకున్నాను. మళ్ళీ తీయకండి ప్లేస్"—అంటున్నాడు పవన్ ఆమెతో. ఆ అమ్మాయి అవస్థపడుతూ వుంది బస్సు హేండిల్స్ పట్టుకోలేక, ప్లాస్టిక్ బుట్ట పట్టుకోలేక, మీదపడే మనుష్యుల్ని తప్పించుకోలేక. రీడింగ్ రూమ్‌వద్ద దిగాను, నదిలో చేపపిల్ల ఈదినట్టు ఈది.

ఆ అమ్మాయి దిగింది బేగ్‌తో. పవన్ దిగాడు. నాకు చాలా సంతోషమైంది. ఆ అమ్మాయి సందులోకి తిరిగింది - వెనక పవన్- ఆ వెనుక నేను. చర్చివరకూ వచ్చాము. అక్కడ చీకటి చిక్కగా వుంది. వీధి లైటు జోగుతోంది. సడన్‌గా ఆగింది ఆ అమ్మాయి- అతను రెండు అడుగులు వెనగ్గా ఆగాడు—నేను మరో నాలుగు అడుగులు వెనగ్గా ఆగాను. ఆమె కళ్ళు చీకట్లో ఎర్రగా అనిపించాయి.

జోడు తీసి నాలుగు వాయిస్తుంది అనిపించింది.

లేదా—అదేదో సినిమాలోలా మంచి నడత గురించి దీర్ఘ ఉపన్యాసం ఇస్తోందేమో అనుకున్నాను.

"ఏయ్ మిష్టర్!....ఇలారా!!" కంఠంలో కటుకే కాక స్పష్టత వుంది. "ఇలా ఫాలో అవుతూ వస్తోన్నావ్...జీవితమంతా ఫాలో అవగలవా-చెప్పు సమాధానం.?" చాలా సౌమ్యంగా అడిగింది.

'ఏ గుడ్ గర్ల్'—అనుకున్నాను.

అక్క దండిస్తే దిక్కుమొఖం వేసుకున్న తమ్ముడిలా అనిపించాడు పవన్ .... ఏ పూర్ ఫెలో!

"పోనీ—నువ్వయితే చిన్నవాడివి....మరి ఇతనో! ఇంత పెద్దవాడై వుండి....ఇలా ప్రవర్తిస్తాడా....సిగ్గులేదూ??"

ఇతనూ అంతే—నేనేనా-చాలా సిగ్గేసింది. ఎందుకూ అంటే ఎందుకో నాకే తెలియదు. వెనక్కి తిరిగా అతని వెనకే! □

---

కళాశాల విద్యార్థులకు చిన్న చిన్న కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# మనిషి

ఎం. వాసుదేవమురళి
గాంధీ వైద్యకళాశాల, హైదరాబాదు.

"వీరా క్లాసులో అమ్మాయిలు ఎంతమంది వున్నారు?" అని అడిగాడు రమణ. వాడికెప్పుడూ అమ్మాయిల గొడవే.

"వాళ్ళ గొడవ నీకెందుకుగానీ త్వరగా నడు. నాకు క్లాస్‌కి టైమ్ అవుతోంది" అన్నాను టైమ్ చూసుకుంటూ. అప్పుడే మధ్యాహ్నం పన్నెండైంది. ఒంటి గంటకు క్లాస్ వుంది.

నాకు మెడికల్ కాలేజిలో సీటు వచ్చిన తరవాత రమణ హైదరాబాదు రావడం అదే మొదటిసారి. వచ్చిన దగ్గరినుంచి శవాలుకోసే గదిని చూపెట్టమని గొడవ చేస్తోన్నాడు. అందుకనే 'డిసెక్షన్ హాల్' చూపెడదామని వాడిని హాస్టల్‌నించి బయలదేరదీశాను.

'సీనియర్స్' హాస్పిటల్ నించి ఇంకా రాలే

దనుకుంటాను కాలేజి గ్రౌండ్‌లో ఎక్కువమంది లేరు. తిన్నగా 'డిసెక్షన్ హాలు'కి దారితీసాను. 'డిసెక్షన్ హాల్' పది గజాలు వుండనగా రమణ ముఖంచిట్లించి "ఇంత వాసన వేస్తోంటే మీరు అక్కడ కూర్చుని శవాలు ఎలా కోస్తారు?" అని అడిగాడు.

ఇక్కడికి వచ్చే కొత్తవాళ్ళు మొట్టమొదట అడిగే ప్రశ్న అదే. "అది శవాలని నిలవచేయడానికి ఉపయోగించే 'ఫార్మాలిన్' వాసన. మాకు అలవాటైపోయింది" అంటూ డిసెక్షన్ హాలులోకి దారితీశాను.

ఆ టైమ్‌లో అక్కడ ఎవరూ వుండరు. హాలు గుమ్మంలో నిలబడితే ఎదురుగుండా దూరంగా వున్న గోడకి వ్రేలాడుతూ 'ఎనాటమీకి తండ్రి' అనదగ్గ 'హెన్రీగ్రే' బొమ్మ వుంది. చెరోవైపూ పదిహేనేసి చొప్పున మొత్తం ముప్పై స్ట్రెచ్చర్లు వాటిమీద సగం సగం 'డిసెక్టు' చేసిన శవాలు వున్నాయి. ఒకేసారి అన్ని శవాలు చూసి దడుచుకున్నాడేమో అని రమణకేసి చూశాను.

వాడు అనుమానంగా ముఖం పెట్టి "ఇవి నిజంగా శవాలా, లేకపోతే మోడల్సా? ఇంత నల్లగా వున్నాయేమిటి? వీటిని కోసి మీరేం చూడగలుగుతారు?" అని అడిగాడు.

"ఫార్మాలిన్‌లో వేయబట్టి అలావున్నాయి. మానవ శరీరంలో ప్రతి అంగుళం నిర్మాణం ఎలా వుందో మాకు తెలియాలి. కాబట్టి అంచెలంచెలుగా శవాన్ని కోస్తూ చూస్తూ పోతాం. ఇదిగో ఇది కాలేయం. ఇది మూత్రపిండాలు. ఇది గుండె. ఇది...." అలా మానవ శరీరంలో మామూలు మనిషికి తెలిసిన భాగాలను చూపిస్తూ చెబుతోంటే వాడు మౌనంగా వింటున్నాడు. వాడి మొహంలో భయం-జుగుప్స-వైరాగ్యం మిశ్రితమైన భావం ఏదో నాకు కనిపించింది.

"ఈ శవాలని కోసేసి చూసిన తరువాత కుట్టేసి వాళ్ళ బంధువులకి అప్పచెబుతారా లేకపోతే మీరే ఎక్కడైనా పాతిపెడతారా?" ధర్మ సందేహం వెలిబుచ్చాడు రమణ.

"పిచ్చి తండ్రీ ఈ శవాలకి బంధువు లెవరుంటారు? ఇవన్నీ ఎవరూ క్లెయిమ్ చెయ్యని శవాలు. బంధువులు చచ్చిన మనిషికన్నా మనీ ఎక్కువ విలువని అమ్ముకున్న శవాలు. వైద్య విద్యార్థులకోసం అని 'డొనేట్' చేసిన శవాలు రావడం బహు తక్కువ. ఇక్కడికి వచ్చిన శవాలు మళ్ళీ అవతలకి వెళ్ళడం వుండదు."

"మరి?"

"ముక్క ముక్కలయిపోతాయి. ఉదాహరణకి చెయ్యి వుందనుకో. మొదట చర్మం తీసేసి కిందున్న నాడులని రక్త నాళాలని చూస్తాం. తరవాత పైనున్న కండరాల నిర్మాణం చూస్తాం. వాటిని కోసేసి లోతుగా వున్న కండరాలని, నాడులనీ, నాళాలని పరిశీలిస్తాం. తరవాత వాటిని తీసేసి ఎముకలనీ కీళ్ళ నిర్మాణాన్ని పరిశీలిస్తాం. అలాగే ఇతర భాగాలని గూడా శరీరంలోంచి తీసి, కోసి, చూసి పారేస్తాం. అర్థమయిందా?" నా వివరణని ఆపి వాడికేసి చూసాను.

వాడు "అబ్బా" అని కళ్ళు మూసుకొని తల విదిలించాడు.

"ఏం కళ్ళు మండుతున్నాయా?" అని అడిగాను ఫార్మాలిన్ ఘాటుకి కళ్ళు మండడం మామూలే కాబట్టి.

"హృదయం మండుతోంది" నిర్లిప్తంగా మొహంపెట్టి అన్నాడు.

"కవిత్వం క్యాంటిన్‌లో చెప్పచ్చు పద" అంటూ అవతలకి తీసుకొచ్చాను.

"కవిత్వం కాదు నిజమే. అసలు ప్రతి ఒక్కడికీ ఒక్కసారైనా ఈ డిసెక్షన్ హాలు చూపెడితే దేశం ఎంతో బాగుపడుతుంది. ప్రతి వాడికి తెలుస్తుంది జీవితంలో ఏంలేదనీ చచ్చిన తరవాత అంతా ఒక్కటే అని. ప్రజలు ఘోరాలని చేయడం కొంతైనా తగ్గిస్తారు" ఆ క్షణాన రమణ నాకు ఒక గొప్ప విరాగిలా కనబడ్డాడు.

ఒకేసారి అన్ని శవాలని చూసి వాడు 'డిప్రెస్' అయినట్టు కనిపించాడు. వాడి 'మూడ్'ని మార్చుదామని దూరంగా చెట్టుకింద నిలబడ్డ మా క్లాస్ అమ్మాయిని చూపిస్తూ "ఆ అమ్మాయి ముక్కు బావుంటుందని మా క్లాస్‌లో చాలా మంది అంటారు. కానీ ముక్కులో ఏం అందం కనబడుతుందో నాకు అర్థంకాదు" అన్నాను.

మామూలుగా అయితే వాడు "ముక్కుదాని అందచందాలు" అన్న సబ్జక్టుమీద గంట లెక్చర్

దంచేవాడు. కానీ ఇప్పుడు నిర్లిప్తంగా ఆ అమ్మాయి కేసి చూసి "ఆ అమ్మాయి మొఖం మీద చర్మాన్ని తీసేస్తే మనం మొదటి స్ట్రెచర్ మీద చూసిన శవం మొహానికి ఆ అమ్మాయి మొహానికి తేడా అట్టే వుండదనుకుంటాను" అన్నాడు.


వాడు ఇంతగా ఎఫెక్టవతా డనుకోలేదు. ఇంతలో మా ప్రొఫెసర్ క్లాసులోకి వెళ్ళడంతో రమణని హాస్టలుకిపంపి నేనుక్లాస్‌లోకివెళ్ళాను.

ప్రాక్టికల్స్ పూర్తి చేసి సాయంత్రం ఐదున్నరకి హాస్టలుకి వెళుతూ రమణ మూడ్‌ని బాగు చేయడానికి ఏం చేయాలా అని ఆలోచిస్తూ వెళ్ళాను.

హాస్టలులో రూమ్ దగ్గరికి వెళ్ళేసరికి మాటలు వినబడుతున్నాయి. రమణ నా రూమ్ మేట్‌తో అంటున్నాడు "మళయాళం సినిమా కదా పెద్ద రష్ వుండదనుకున్నానండి. కానీ తెగ వచ్చారండి జనం. టికెట్ దొరకడం కష్టం అయింది."

"సినిమాఎలావుంది?" నా రూమ్‌మేట్ ప్రశ్న.

"సినిమా పెద్ద అర్థం కాలేదండి. అయినా సినిమా చూడడానికి వచ్చిన వాళ్ళంతా కేరళ వాళ్ళు కాదుకదండీ. అంతా హీరోయిన్‌ని చూడడానికి వస్తారు" వాడు విడమర్చి చెబుతున్నాడు. నాకు మతిపోయింది. మధ్యాహ్నం ఒంటిగంట రమణకి సాయంత్రం ఐదున్నర రమణకి ఎంత తేడా! నాకెందుకో హఠాత్తుగా — కొత్తగా కాపరానికి వచ్చి నెల తిరగకుండానే ప్రమాదంలో పెన్ని చచ్చిపోతే ఇక తనకి జీవితమే లేదని తనూ చస్తానని నానా గొడవ చేసి మూడు నెలలు తిరగకుండానే రెండో పెళ్ళి చేసుకున్న బాబయ్య గుర్తుకి వచ్చాడు. మళ్ళీ నాకే అనిపించింది వైరాగ్యం శ్మశానం వరకే పరిమితం కాబట్టి ఈ ప్రపంచం ఇలా వుంది. లేకపోతే ఈ లోకంలో గౌతమబుద్ధులు, అశోకులు చాలా మంది వుండేవారు □



శ్రీమతి ఆర్. మాధవీలత రచించిన 'ఈ తరం మగువ' యిటీవల మద్రాసులో శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి అంకితమిచ్చిన సందర్భంలో కృష్ణశాస్త్రిగారి ఉపన్యాసాన్ని చదువుతున్న శ్రీ బి. యస్. ఆర్. కృష్ణగారు. శ్రీమతి ఎ. జి. హేమలత, డి. హేమలతా, ఆంజనేయులు, రచయిత్రి ఆర్. మాధవీలత కూడా చిత్రంలో ఉన్నారు.